'అంతంత మాటలు నావల్ల మాళనే మాళదు సార్'

'శబ్దాడంబరం'

'అప్పాప్పా, ఏమి దడబుడల్‌గా వుంది సార్'

'అభ్యుదయ శరం'

'ఏమి గరం సార్'

'మృదుమధురం'

'ప్రమిదు మదిరమా సార్?'

'పదగుంభన'

'సార్, ఇంక వద్దుసార్. ఈ విమర్శనె మన వల్ల మాళదు సార్. అడడా, దీనికి ఎంతెంత మాటలు నేర్వవలె, ఏమికత? మీరేదో సెప్తే, నేనేమో సులువుగా వుండునేమోనని తలిస్తిని. నా తలె తీసినాకూడా, నావల్ల ఈమాటలు పలికేదానికి ముడియాదు సార్. నాకు కవిత్వం బాగావుంటే 'భేష్, బాగుందప్పా' అనీ, లేక 'సెహ బాష్, బాగా సెప్పినావప్పా' అనీ, లేదు బాగుండేదే లేదంటే, 'ఇది యేమిరా కవిత్వం, కసుమాలం మాదిరిగా వుండాది, కుప్ప తొట్టి కవిత్వం సెప్తివే, నీ కవిత్వం నీమూంతి మాదిరిగా దావుంది, ఇదియేమి కోంతి కవిత్వంరా, దొంగపిల్లకాయా,'' అని తిట్టేసి వూడుస్తును. నా విమర్శ అట్లా వుండును సార్.'

'అది కాదు పార్థసారథి—'

'సార్, నన్ను ఎక్స్యూజ్ సేసుకోండి. మీరు సెప్పే విమర్శ మాత్రం నావల్ల ముడియనే ముడియదు సార్.'

అవధరింపుడు, రాజకీయవాదులు!

# వర్గ కలహం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

వంటయింట్లో ఏదో పని చేసుకుంటున్న సరస్వతి వీధిలో కుర్రవాడి ఏడుపు విని బయటికి పరుగెట్టింది తొందరగా. ఆవీధి ఐదారు కుటుంబాల పిల్లలూ చాలా సేపట్నించి అక్కడ ఆడుకుంటున్నారు. రోజూ కార్యక్రమమే అంత. ఆమె బైటకిపోయేసరికి చాలామంది పిల్లలు గుమిగూడి ఉన్నారు; ప్రక్కఇంటి శాంతగారి అబ్బాయి ప్రకాశం నెత్తుట తడిసిన మొగంతో ఏడుస్తున్నాడు. సరస్వతి కొడుకు రంగడు వాడిప్రక్కన నిలబడి దోషిలాగ చూస్తూ దీనంగా కనిపిస్తున్నాడు.

''రంగడు రాతితో కొట్టేశాడు ప్రకాశాన్ని" అని అయిదారు గొంతుకలు అరచే లోగానే రంగని వాలకాన్నిబట్టి గ్రహించింది సంగతి సరస్వతి. కాని ఇంకేమీ ఆలశ్యం చెయ్యకుండా ఆమె ప్రకాశాన్ని ఎత్తుకుని లోనికి తీసుకుని పోయింది. ముఖమంతా అలముకొన్న రక్తాన్ని కడిగి శుభ్రంగా కట్టుకట్టింది. పిల్లలు చాలమంది ఇంట్లోకి రాకుండా బైటగుమ్మంలో నిలబడి గుసగుస లాడుకొంటున్నారు.

ఒకఅరగంట గడిచేసరికి కుర్రవాడి గాయానికి కట్టుకట్టి కొంచెం కాఫీ ఇచ్చి సేదదీర్చింది. ఇంతసేపూ ఆమె ప్రకాశానికి ఇచ్చే సలహాలు తప్ప ఏమాటా ఆడలేదు. రంగడు దోషసూచిత దృక్కులతో ఆమె వెనుక తిరుగుతున్నాడు.

అప్పుడువచ్చింది శాంత తొందరగా సరస్వతి దగ్గరకి. ఆమె అవతల వీధికి పేరంటానికి వెళ్లిందట ఎప్పుడూ లేనిది వంటరిగా. ఇంటికి వచ్చేసరికి ఈ 'మాయదారి కబురు' తెలిసికొని ఆమె కొడుకుని చూడడానికి వచ్చింది.

తల్లిని చూసేసరికి ప్రకాశం మంచంవదలి పరిగెట్టాడామె దగ్గరికి. ఆమె వాణ్ణి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ కంగారుగా అంది: "ఎవరు నాయనా అంతగా కొట్టేశారు?"

ఈసరికి సూర్యుడు పూర్తిగా అస్తమించాడు. కుర్రవాళ్లంతా ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు. సరస్వతి అప్పుడే దీపం వెలిగించింది. ఆ వెలుగులోకూడా ఆమె శాంత ముఖంలో ఉన్న కోపాన్ని గ్రహించింది. ఆమె ప్రశ్న వేసేసరికి సరస్వతి ఒక్కసారి త్రుళ్లిపడింది.

ప్రకాశం నెమ్మదిగా అన్నాడు: "రంగ డెందుకో పడమటి గోడవైపు రాయి విసిరే దమ్మా. నేను చూసుకోక"-అర్ధోక్తిలోనే ఆపి అంది శాంత: "నే ననుకుంటూనే ఉన్నా నా నాయనా, వా డెప్పుడో అంతపనీ చేస్తాడని ఎన్నిసార్లో చెప్పాను. అలాంటి వెంకివాళ్ళతో ఆడకూడదని, వాళ్ళ కేమిటి! రాళ్ళతో కొట్టనూ కొడతారు. ఇంకా కోపంవస్తే చంపనూ చంపు తారు."

సరస్వతి చాలా శాంత స్వభావంగలది. ఆమె రంగడి విషయంలో మరీ శాంతంగా ఉంటుంది. రంగడుకూడా చాలా బుద్ధిమంతుడు. అనవ సరంగా ఒకరిజోలి కెప్పుడూ పోడు. ప్రకాశం అంటే చాలా ఇష్టపడతాడుకూడా. అదీ కాక రంగడి తప్పేమీలేదని ప్రకాశం చెప్తూనే ఉన్నాడు కూడాను. అలాంటప్పుడు అంత మోటుగా శాంత తన కొడుకుని ఏమో చేసినట్లు గోల చెయ్యడం ఆమె మనస్సుని చాలా నొప్పిం చింది-అయినా ఆమె ఏమీ మాటలాడలేదు. రంగడుకూడా బిక్కముఖం వేసుకుని క్రిందికి చూస్తూ ఉండిపోయాడు.

ఈ నిశ్చలత్వం చూసేసరికి శాంతకి వశ్ళు మండింది. కొడుకు తప్పు తెలిసికొనికూడా సర స్వతి మౌనంగా ఉండిపోవడం ఆమె కోపాగ్నిని రగిల్చింది. కాస్త కోపం నూగిస్తూ ఆమె అంది: "ఏమమ్మా బీదవాళ్ళమైనామని ఇంతలోకువా? కుర్రాణ్ణి రాళ్ళతో కొట్టిస్తావా!"

ఈమాట చాలా గురిచూసి విసిరింది శాంత-అది సరస్వతి హృదయంలో చాలా గాఢంగా గుచ్చుకుపోయి ఆమెశోషాన్ని ఎక్కువ చేసింది. తనకి ప్రకాశంమీద గాని శాంతమీద గాని ఏమీ కోపం లేదే! శాంత ఒక గుమాస్తా భార్య, సరస్వతి ఒక డాక్టరుభార్య కావచ్చును-కాని అంతమాత్రాన పసిపిల్లల్ని కొట్టించే అవసరం, క్రౌర్యమూ తనకేవీ?

ఈ మాటలన్నీ సరస్వతి అందామనుకుంది-కాని అనలేకపోయింది. ఆమె ప్రకాశాన్ని గురించి చాలా బాధపడుతుంది. బహుశా తన దేహంనించి ఒకటిరెండు మాంసకండరాలు కోసి ఇచ్చి వాణ్ణి వెంటనే బాగుచేయగలిగితే అలాగ చేసేదేమో!

శాంత సరస్వతి మౌనానికి ఆగలేకపోయింది. ప్రకాశాన్ని భుజంమీద వేసుకుని ఇంటికి వెళ్ళి పోయింది ఏదో గొణుగుకుంటూ.

*      *      *

మూడురోజులు గడిచాయి. శాంత కొడు కుని చాలా జాగ్రత్తగా ఉంచేస్తూంది ఆటలకి పోకుండా. రంగడు కూడా ఆటలకి పోవడం మాని నాన్నగారితో క్లబ్బుకి పోతున్నాడు.

పరిస్థితులిలాగ ఉండిపోతే తీరిపోను. కాని శాంత కోపం చాలా తీవ్రమైనది. ఆమె అను కుంది: "తప్పు చేసిన పిల్లలని దండించలేని తల్లులు ఎలాగ మనగలరు? సరస్వతి ఆనాడే కొడుకుని చితుకగొట్టి ఉండవలసింది." ఆలోచన వచ్చినప్పుడల్లా ఆమె రంగడివల్ల జరిగినది పొర పాటు అన్న విషయాన్ని మరిచిపోవ వీలుచేసు కునేది.

రంగడూ, ప్రకాశం చక్కని స్నేహితులు. వాళ్ళిద్దరికీ ఒకరిమీద ఒకరికి ఏమీ ద్వేషం లేదు కాని శాంత తెచ్చిపెట్టిన పరిస్థితివల్ల వాతావరణం అంతా మారిపోయింది. వాళ్ళి ద్దరూ అనుకోసాగారు. 'వాడికి నామీద ద్వేషం' అనీ, 'నిజానికి నాకు వాడిమీద ద్వేషమేమీ లే'దనీ అందుచేతనే వాళ్ళెప్పుడైనా తారసపడి నప్పుడు ఒకరినొకరు చూసుకోవడమే మానే శారు.

శాంత భర్త రామారావుకి డాక్టర్ మూర్తి గారంటే చాలా గౌరవం. కాని పై సంఘటన జరిగిననాడు రాత్రి శాంత అతనితో చాలా కల్పించి చెప్పింది-డాక్టర్ భార్యకి తామంటే కోపమనీ, బీదవాళ్ళనే నిర్లక్ష్యం కొద్దీ ఇలాగ తమయెడల ప్రవర్తించారనీ. 'చేసే గుమాస్తా ఉద్యోగానికి మాతో జట్టికి వచ్చావా' అని ఆనాడు తన నామె అడిగిందనీ అసలు కొడుకు మీద ఆమె ఎందుకు చెయ్యి చేసుకోలేదనీ.

మూర్తిగారి విషయంలో రామారావుకి గౌరవం పోలేదీ సంఘటన తరవాత-కాని అది తగ్గింది. ఎక్కడెప్పుడైనా తారసిల్లితే ముఖం తిప్పుకునేవాడు.

సరస్వతి భర్తతో అంతా చెప్పింది. అందు చేత అకను మారిపోయిన రామారావు ప్రవర్తన కేమీ ఆశ్చర్యం పొందలేదు. శాంత గుణంవల్ల

కదా ఇతను మారాడని ఆతను జాలిపడ్డాడు కూడా.

* * *

బడిలో ప్రకాశం, రంగడూ రోజూ కలుసుకుంటూనే ఉన్నారు. వాళ్ళసీట్లు క్లాసులో ఓ దగ్గరే. డ్రిల్లుకి నిలువబడ్డా ఇద్దరూ ఒక దగ్గరే నిలువబడాలి.

వాళ్ళిద్దరూ ఒకరినొకరు చూసినప్పుడు అనుకోసాగారు: 'వాడు పలకరిస్తే బాగుండు'నని.

ఆవేళ మాస్టర్ పిల్లలచేత నాటకం వేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. తరగతిలో తెలివైనవాళ్ళు రంగడూ, ప్రకాశమూను. ఇద్దరినీ కృష్ణుడూ బలరాముడూ వెయ్యమన్నారు.

సరదాగా మొదటి రిహార్సల్ వేయించారావేళ. రంగడూ ప్రకాశంకూడా చక్కగా అభినయించారు.

బడి వదలేక రంగడూ ప్రకాశం మాస్టర్ చెప్పినప్రకారం సలహాలు పొందడానికి ఉండిపోయారు. నటించడం ఎలాగో అంతా చెప్పి ఇంటికి వెళ్ళమన్నాడాయన.

ఈ మధ్యకాలంలో వచ్చిన నిశ్శబ్దతని ఆ బాలురిద్దరూ ఇంక భరించలేకపోయారు. గేటు దాటగానే ప్రకాశమే ముందు అన్నాడు. "ఏరా రంగా? నాటకం ఎప్పుడు వేయిస్తారు!"

విప్పారిన ముఖంలో అన్నాడు రంగడు... "ఏమోరా...పరీక్షనాడేమో!"

"మాష్టరుకి తెలియకుండా రోజూ మనం ప్రాక్టీసు చేసుకుందామేం?"

ఒక నిమిషం నిశ్శబ్దంగా గడిచింది. బహుశా ఇద్దరూ ఆనాటినించి జరిగిన కథని పునశ్చరణ చేస్తూంటారు.

ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని భంగపరచుతూ అన్నాడు ప్రకాశం: "అమ్మకి తెలియనీయొద్దు. బళ్ళోనే కూర్చుందాం".

విడిపడ్డ అమాయిక హృదయాలు రెండూ పూర్వాధికబలంతో అతుక్కున్నై.

* * *

బడినించి ఆనాడు మలుపువరకూ కూమాలుగా రంగడూ ప్రకాశం కలిసివచ్చారు. అక్కడ విడిపోతూ రంగడు పరుగెత్తబోయాడు. రాయి తగులుకున్నది. ప్రక్కగోడమీద పడ్డాడు. కణత బ్రద్దలైంది. ముఖం రక్తంతో నిండిపోయింది.

ప్రకాశం అంతా చూశాడు...ఏదో ఉపాయము...వెంటనే రంగణ్ణి ఇంటికి దిగబెట్టాడు. సరస్వతి కంగారుగా వాడి ముఖం కడిగి మందు రాసింది. ప్రకాశం రంగడికయ్యి వదలనే లేదు.

చీకటి పడింది. అష్టమినాటి అర్థచంద్రుడు మేఘాల చాటునుంచి మసక కాంతులని ప్రసరింప చేస్తున్నాడు.

రామారావు ఆఫీసునించి వచ్చేసరికి శాంత కుర్రవాడికోసం ఎదురుచూస్తూ ఉంది. అందోళనగా ఇద్దరూ బయలుదేరారు వాణ్ణి వెతకడానికి. స్నేహితుల ఇళ్లు, బజారు, వాడుండడానికి వీలున్న అన్నిచోట్లా వెదికారు. కాని ఎలాగ కనిపిస్తాడు?

చివరకి డాక్టరుగారింటికికూడా వెళ్లారు అభిమానం చంపుకుని. సరస్వతి కుర్రాళ్ళని పెట్టుకుని ఏదో మాట్లాడుతూంది - శాంతవచ్చింది.

తల్లిని చూచినా కదలకుండా అన్నాడు ప్రకాశం -"ఆవేళ నన్ను కొట్టినదానికి రంగణ్ణి పడతోశానమ్మా... డాక్టరుగారు నన్ను పట్టుకున్నారు"- అబద్ధం అని ఎవరూ అనలేనట్టు.

శాంతకి మిన్ను విరిగి మైబడ్డట్టుంది. ఆమె ప్రకాశాన్ని రెక్కపట్టుకుని లాగుతూ - "తప్పు కాదు దొంగ వెధవా?" అని ఒక్కటి కొట్టబోయింది.

సరస్వతి అడ్డుకుంది - రంగడు అన్నాడు "నేనేపడ్డాను. వాడు నన్నేమీ చెయ్యందే!"

శాంతముఖం దించుకుంది, ఓసారి సరస్వతివైపూ, ఒకసారి రంగనివైపూ చూసి.

ప్రకాశం అన్నాడు: "ఆనాడు వాడు నన్నేంచెయ్యలేదంటే నమ్మావా? అదేం పనికి రాదు. నన్ను కొట్టాలి. డాక్టరమ్మగారు అమ్మని దెబ్బలాడాలి. అమ్మ ఊరుకోవాలి."

అప్పుడే వచ్చిన మూర్తిగారితో కలిసి అందరూ గొల్లుమని నవ్వుతూంటే సరస్వతితో అంది శాంత: క్షమించండి, పొరపాటైంది" అని.

"రేపు మీరంతా భోజనానికి వస్తేనే" అన్నది సరస్వతి.